


గిరిజనులకు చింతే!



- గిట్టుబాటుకాని చింత పండు ధర
- కష్టమే తప్ప.. మిగులు లేదని ఆవేదన

(మెళియాపుట్టి)

గిరిజనులకు అటవీ ఉత్పత్తులే ప్రధాన జీవనాధారం. కాగా ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో ఆశించినస్థాయిలో చింతపండు దిగుబడి లేదు. మరోవైపు జీసీసీ అధికారులు కొనుగోలు చేపట్టకపోవడం, దళారుల ప్రమేయంతో గిరిజనులకు చింతే మిగులుతోంది. మెళియాపుట్టి మండలం జంతూరులోని సుమారు 25ఎకరాల కొండ ప్రాంతంలో దాదాపు 250 చింత చెట్లు ఉన్నాయి. ఏటా వీటి ఉత్పత్తుల ద్వారా గిరిజనులకు రూ.1.50లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది మద్దతు ధర లేకపోవడంతో కనీసం రూ.50వేలు అయినా వస్తుందో రాదోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. జీసీసీ అధికారులు సకాలంలో మద్దతు ధర ప్రకటించకపోవడంతో కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదని వాపోతున్నారు. ఓ వైపు చింత పంట తీసేందుకు కూలీల రేట్లు పెరగ్గా.. ఆశించినస్థాయిలో దిగుబడులు లేక తమకు నష్టాలు తప్పడం లేదని పేర్కొంటున్నారు.



రోడ్డుపై చింతపండును విక్రయిస్తున్న గిరిజనులు

ఇదీ పరిస్థితి

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 250 ఎకరాల్లో 468 మెట్రిక్ టన్నులు చింతపండు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొండలో విడిగా చెట్లు ఉండడం వల్ల అంచనాలు దొరకడం లేదని జీసీసీ అధికారులు చెబుతున్నారు. తీతలీ తుఫాన్ సమయంలో చాలా చెట్లు నేలకొరిగాయి. ఆ తర్వాత కొన్ని చెట్లు బలహీన పడడం, మరికొన్ని ముదిరిపోవడంతో కాపు అంతగా రావడం లేదు. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటకపోవడంతో గిరిజనులకు అటవీ ఉత్పత్తులు తగ్గిపోయాయి. ఫలితంగా వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో సుమారు 6.81 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25కిలోలు చొప్పున జిల్లాకు 17,025 మెట్రిక్ టన్నులు చింతపండు అవసరమని అంచనా. ఏటా 24 స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేసేవారు. ఈ ఏడాది ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదు. ప్రస్తుతం పాత చింతపండు మార్కెట్‌లో కిలో రూ.25 వరకు పలుకుతోంది. గిరిజనుల వద్ద మాత్రం రూ.15కే కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు దళారుల జోక్యంతో గిరిజనులు నష్టపోతున్నారు. అధికారులు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో గిరిజనులు వారపు సంతల్లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా దళారులు వారి వద్ద తక్కువ ధరకు చింతపండును కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో గిరిజనులు మరింత నష్టపోతున్నారు.

కోల్డ్‌స్టోరేజ్‌లు లేక..

అటవీ ఉత్తత్తులు దాచుకునేందుకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో కోల్డ్‌స్టోరేజ్‌లు లేక గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెళియాపుట్టి, మందస, సీతంపేట, భామిని, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల్లో గిరిజనులు పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో దళారులు చెప్పిన ధరకే పంటను విక్రయిస్తూ నష్టపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇంతలో ఎన్నికలు సమీపించి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ నాలుగున్నరేళ్లలో కోల్డ్‌స్టోరేజ్‌ల ఊసేలేదు. గతంలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంబా రవిబాబు పర్యటించినప్పుడు గిరిజనులు తమ సమస్యను వివరించారు. ఈ మేరకు మెళియాపుట్టి మండలం నేలబొంతులో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించినా.. ఇంతవరకూ దాని ఊసే లేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.


కొనుగోలు చేస్తాం

గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం. గిరిజనులకు మద్దతు ధర కల్పిస్తాం.

- గొర్లె నరసింహులు, జీసీసీ మేనేజర్, పాతపట్నం

26న 'రా.. కదలిరా'

- శ్రీకాకుళం నగరానికి రానున్న చంద్రబాబు
- లక్ష మందితో భారీ సభకు ఏర్పాట్లు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో 'రా కదలిరా' కార్యక్రమం ఈనెల 26న శ్రీకాకుళంలో నిర్వహించనున్నారు. ఈమేరకు కార్యక్రమం తేదీ ఖరారైంది. ముందుగా 27న అనుకున్నారు. అదేరోజున టీడీపీ-జనసేన ఉమ్మడి సభ విజయవాడలో నిర్వహించనుండడంతో.. 'రా కదలిరా' తేదీ జిల్లాలో ఒకరోజు ముందుగా జరగనుంది. 26న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సభ నిర్వహిస్తారు. సుమారు లక్ష మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు ఆరంభమయ్యాయి. శ్రీకాకుళంలో ఎనభై అడుగుల రోడ్డు పక్కన లేదా జాతీయరహదారికి ఆనుకున్న ఉన్న స్థలంలో సభ నిర్వహించాలనే దానిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు చంద్రబాబు పర్యటన రద్దయింది. ఈ సారి పర్యటన ఖరారు కావడంతో సభను విజయవంతం చేసేందుకు తెలుగుతమ్ముళ్ల సన్నద్ధమవుతున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం ఆవిష్కరణ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

విజనరీ నాయకుడు చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. యువ ఓటర్లంతా తమ భవిష్యత్‌కు పాటుపడే నాయకుడికే ఓటు వేయాలని సూచించారు. గురువారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' క్యాంపెయిన్‌ని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ రామ్మోహన్ మాట్లాడుతూ.. 'తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేవారే కీలకం. వారి ఆశలు, ఆకాంక్షలు, భవిష్యత్‌కు మార్గం వేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇందుకు అనుగుణంగా మేలు చేసే పార్టీలకే యువ ఓటర్లంతా ఓటు వేయాల'ని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిదేనని గుర్తుచేశారు. యువతకు నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేకంగా స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్, ఉపాధి కోర్సులతో లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. మళ్లీ చంద్రబాబు నాయుడితోనే రాష్ట్రానికి పునర్వైభవం సాధ్యపడుతుందని వెల్లడించారు. యువ ఓటర్లంతా ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నలకు ఎంపీ రామ్మోహన్ బదులిచ్చారు. కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

బీఆర్‌ఏయూ తరగతుల వేళల్లో మార్పులు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కోర్సుల తరగతుల నిర్వహణ వేళల్లో మార్పులు చేసినట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. గురువారం ఆమె చాంబర్‌లో మాట్లాడుతూ.. 'వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కోర్సులకు ఇప్పటివరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఆర్ట్స్ కోర్సులకు ఈ నెల 26నుంచి ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల తరగతుల నిర్వహణ వేళలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వారంలో ఓ రోజు గంటపాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తాం. వచ్చే నెల మొదటివారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. వచ్చే నెలలో పాలక మండలి సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామ'ని తెలిపారు.

పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్/ శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22: ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షలకు సంబంధించి పటిష్ఠ ఏర్పాట్లు చేయనున్నట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ జీఆర్ రాధిక వెల్లడించారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి ఇంటర్, పదో తరగతి పరీక్షలతోపాటు, డీఎస్సీ, టెట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్‌గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ బందోబస్తు ఉండాలి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి. నిరంతర విద్యుత్తు సరఫరా, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు, పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో రవాణా సౌకర్యం కల్పించాలి. పరీక్షల కేంద్రాలకు 100 మీటర్ల లోపు జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించాలి. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో ఏ సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లను వినియోగించరాదు' అని తెలిపారు. జిల్లాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్టు కలెక్టర్, ఎస్పీ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో వెంకటేశ్వరరావు, విద్యాశాఖ పరీక్షల సహాయకుడు ఆలీఖాన్, ఆర్‌ఐవో దుర్గారావు, డీవీఈఓ ప్రకాశరావు, ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నిరసన

అరసవల్లి, ఫిబ్రవరి 22: కేంద్రప్రభుత్వ దమన కాండను నిరసిస్తూ గురువారం స్థానిక పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రజాసంఘాలు నిరసన ర్యాలీ చేపట్టాయి. పంజాబ్ - హర్యానా సరిహద్దు ఖనౌరి వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై జరిగిన కాల్పుల్లో యువరైతు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టీయూజిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, జిల్లా కమిటీ సభ్యులు బర్ల గోపి, వివిధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల నిరసన ర్యాలీ

అరసవల్లిలో అంతరించిపోతున్న పచ్చదనం

- అభివృద్ధి పేరుతో విశిష్టమైన చెట్ల తొలగింపు
- పెరుగుతున్న వాయుకాలుష్యం
- భక్తుల్లో విస్మయం

(శ్రీకాకుళం క్రైం)

అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో వందేళ్లనాటి విశిష్టమైన వృక్షాలు అంతరించిపోతున్నాయి. అభివృద్ధి పేరుతో చెట్లను తొలగిస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా పచ్చదనానికి దూరమై.. వాయు కాలుష్యం పెరుగుతోంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని సాక్షాత్తు ఇంద్రుడు ప్రతిష్ఠించినట్టు పురాణాలు చెబుతున్నాయి. ఆదిత్యుడ్ని దర్శిస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో ఆదిత్యుడి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతూనే ఉంది. భక్తులకు సౌకర్యాలు కల్పించే దిశగా ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆలయంలో ఉన్న విశిష్టమైన, పురాతన వృక్షాలను అధికారులు తొలగిస్తున్నారు. ఒకప్పుడు ఆలయం ముందు విశిష్టమైన కదంబర వృక్షం, సంపంగి, నాగమల్లి, కోటిలింగాల వృక్షం, నూరువరహాల చెట్లు ఉండేవి. వాటి పుష్పాలతో ఆదిత్యుడికి నిత్య పూజలు, అలంకరణ చేసేవారు. శ్రీసూర్యనారాయణస్వామి అంతరాలయం వద్ద శక్తి రూపిణీ దుర్గమ్మకు ప్రీతికరమైన కదంబర పుష్పాలను సమర్పించేవారు. అశ్వీజ మాసంలో దుర్గమ్మకు నవరాత్రుల పూజలు చేయటం ఆనవాయితీ. ఈ పూజల్లో ప్రధానంగా కదంబర పుష్పాలతో అమ్మవారితోపాటు ఆలయానికి అధిష్ఠాన దేవునిగా ఉన్న భువనేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామిని అర్చించేవారు. ఈ వృక్షాలు, పుష్పాల ద్వారా పరిమళ సుగంధాలు వెదజల్లేవి. ఇంతటి ప్రాధాన్యమైన చెట్లను తొలగిస్తుండడంతో భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో నవగ్రహాల మండపం వద్ద ఎన్నో ఏళ్ల నాటి రావి, వేప చెట్లను సైతం ఇటీవల సగానికి నరికివేశారు. వీటిని తొలగించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కాగా ఆలయ అధికారులు నిబంధనలు పాటించకుండా చెట్లను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ అధికారులు చెట్లను తొలగిస్తున్నారు కానీ, సువిశాల స్థలం ఉన్నా మొక్కలు నాటేందుకు మాత్రం ఆసక్తి చూపడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాయు కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయంలో ఉన్న వృక్షాలను తొలగించకుండా.. మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



నవగ్రహ మండపం వద్ద నరికేసిన రావి చెట్టు



రేకుషెడ్ కోసం వేపచెట్టును ఇలా..

పచ్చదనాన్ని పెంపొందిస్తాం

నేను ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఆలయం వద్ద ఉన్న ఇంద్ర పుష్కరిణి పనులు మరో మూడునెలలో పూర్తి చేస్తాం. వర్షాకాలంలో కోనేరు చుట్టూ నీడనిచ్చే వృక్షాలతో పాటు దేవతా వృక్షాలను కూడా ఏర్పాటు చేస్తాం. ఆలయానికి చెందిన తోటలోనూ, నవగ్రహాల మండపం వద్ద నక్షత్ర వనం, రాశి వనం మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తాం. ఆలయంలో పూలనిచ్చే మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పునరుద్ధరిస్తాం.

- డీఎల్‌వీ రమేష్, ఈవో, అరసవల్లి

అవయవదాతకు కన్నీటి వీడ్కోలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22: రోడ్డుప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఓ మహిళ బ్రెయిన్ డెడ్ అయ్యింది. తాను చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేసింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవదాతగా నిలిచిన ఆమెకు బంధువులు, వైద్య సిబ్బంది కన్నీటి వీడ్కోలు పలికారు. వివరాల్లోకి వెళితే.. పాతపట్నం మండలం పెదలోగిడికి చెందిన జైనవలస ఉషారాణి(40) ఈ నెల 19న తన మరిది శుభకార్యక్రమానికి వెళ్తూ హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఉషారాణిని రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఉషారాణి 21న బ్రెయిన్ డెడ్ అయింది. ఆమె భర్త కృష్ణారావు, పిల్లలు నిఖిత, పల్లవి, జోషిత్‌కు ఆస్పత్రి యాజమాన్యం అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం జీవన్‌ధాన్‌ను సంప్రదించారు. గురువారం ఉషారాణికి శస్త్రచికిత్స చేసి లివర్‌ను విశాఖలోని పినాకిల్ ఆస్పత్రికి, ఒక కిడ్నీని విశాఖలోని కేజీహెచ్‌కి, మరో కిడ్నీని జెమ్స్‌కి, రెండు కళ్లను రెడ్‌క్రాస్‌కు తరలించారు. ఉషారాణి భౌతికకాయాన్ని ఆసుపత్రి సిబ్బంది ర్యాలీగా తీసుకెళ్లి కన్నీటి నివాళులర్పించారు. ఉషారాణి కుటుంబ సభ్యులకు అవయవదాన ధ్రువపత్రం అందించారు. శస్త్రచికిత్స చేసిన వారిలో జెమ్స్ సీఈవో ఎస్.రామ్మోహన్, డైరెక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ లక్ష్మి లలిత, సూపరింటెండెంట్ అశోక్ రెడ్డి, డాక్టర్ శివఅన్వేష్, ఆర్‌ఎంవోలు బాలమురళీ, పవీణ్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న ఉన్నారు.



ఉషారాణి (ఫైల్)

నివాళి అర్పిస్తున్న జెమ్స్ వైద్యసిబ్బంది



ఉద్యోగులకు ముందస్తు నోటీసులు

రాష్ట్ర జేఏసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు విజయవాడలో ఈ నెల 27న నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులు హాజరుకాకుండా పోలీసులు ముందస్తు నోటీసులను అందజేశారు. గురువారం పలాసలో ఏపీఎన్‌జీవోఎస్ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావుకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, భావప్రకటన రాజ్యాంగం కల్పించిందన్నారు. శాంతియుతంగా ఉద్యోగులు నిరసన చేపడతామంటే నోటీసులు ఇవ్వడం బాధాకరమని తెలిపారు.

- పలాసరూరల్

కాంగ్రెస్ జిల్లా నాయకుల అరెస్టు

ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఇచ్చిన పిలుపుమేరకు అమరావతిలో శాంతియుతంగా నిరసన చేస్తున్న తనతోపాటు జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణరావు, మజ్జి మురళీమోహన్‌లను అరెస్టు చేశారని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అనేకమంది కార్యకర్తలను గృహనిర్బంధం చేశారని, పలువురికి నోటీసులిచ్చి బెదిరించారని అన్నారు. చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, పార్టీ నాయకులు దాట్ల లింగమూర్తి, కొత్తకోట సింహాద్రి నాయుడు, ఎం.చక్రవర్తిరెడ్డితో పాటు జిల్లాకు చెందిన 30 మంది కార్యకర్తలను విజయవాడలో అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్లలో నిర్బంధించారని తెలిపారు. ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడడం ఈ ప్రభుత్వానికి పరిపాటైందన్నారు.

- అరసవల్లి





నరసన్నపేట: అవగాహన కలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి: సార్లిగాం, సంతబొమ్మాళి: రెయ్యిపేట, హిరమండలం: పాతహిరమండలం, జలుమూరు (సారవకోట): అక్కివలసల్లో సూపర్ సిక్స్ కరపత్రాలిచ్చి వివరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

సూపర్ సిక్స్‌పై విస్తృత ప్రచారం

టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై గ్రామాల్లో టీడీపీ నాయకులు విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

నరసన్నపేట, ఫిబ్రవరి 22: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. గురువారం పట్టణలోని దేశవానిపేటలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. పట్టణంలో వైసీపీ పాలనలో అక్రమ ఇలు, భూకబ్జాలు తప్ప మరేం అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామా రావు, నేతలు గొద్దు చిట్టిబాబు, తిరుపతిరావు, బెవర రాము, పీస కృష్ణ, సరియపల్లి మధు, తాళాభక్తుల గోవిందరావు, సీతాపతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధానాలతోనే ధరల పెరుగుదల

టెక్కలి: నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, పెట్రోల్, డీజిల్ చార్జీల పెంపునకు వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని టీడీపీ మండల నాయకులు అన్నారు. గురువారం లింగాలవలస పంచాయతీ సవర సార్లిగాం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టాలని కోరారు.

వైసీపీకి చరమగీతం పాడుదాం

సంతబొమ్మాళి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. గురువారం సంతబొమ్మాళి పంచా యతీ రెయ్యిపేటలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాడాన రమణమ్మ, మాజీ సర్పంచ్‌లు కూశెట్టి కాంతారావు, మెండ అప్పారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, అల్లు రమేష్, పప్పు కృష్ణారావు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించాలి

కొత్తూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కోరారు. వసప గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య, టీడీపీ, జనసేన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

జలుమూరు (సారవకోట): చంద్రబాబు నాయకత్వంలో టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. అక్కివలస, గడ్డిపేట గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్ల ఆనందరావు, బోర ధర్మారావు, జన, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నొక్కుడు సరే.. బాదుడు సంగతేంటి?

హిరమండలం: సీఎం జగన్‌రెడ్డి బటన్ నొక్కుతున్నానని గొప్పలు చెబుతున్నారని, అయితే పన్నులు, చార్జీల రూపంలో ప్రజలపై వేస్తున్న బాదుడు సంగతేంటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ప్రశ్నించారు. గురువాం పాత హిరమండలంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, బర్రి సురేష్, కె.సింహా చలం, దారపు డిల్లేశ్వరరావు, దంత తేజ, ఎస్.గోవిందరావు, నారాయణ రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం

అరసవల్లి: వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు సంక్షేమం, సంతోషం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. గురువారం నగరంలోని 48వ డివిజన్‌లో ఇన్‌చార్జి సురకాసి వెంకటరావు, బీసీ సెల్ ఉపాధ్య క్షుడు శిల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించడం ద్వారా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, నగర తెలుగు యువత అధ్యక్షుడు శిల్లా సురేంద్ర, సీపాన రత్నం, మడ్డి అప్పలరాజు, మణి, జనసేన యువత తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: మాట్లాడుతున్న కళా వెంకటరావు

జగన్‌రెడ్డి పాలనను అంతమొందించాలి: కళా

రణస్థలం: సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనను రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాపువీధిలో బాబు సూపర్ సిక్స్‌పై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రాన్ని అధోగతిపాల్జేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. ధరలు మండిపోతున్నాయని, సామాన్యుడి బతుకు భారమైందన్నారు. ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని, ఇప్పుడు మళ్లీ ఓట్లు అడేగేందుకు సిద్ధపడుతున్నారని, వారిని చీపుర్లతో తరమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లంక శ్యామలరావు, మాజీ ఎంపీపీ ఆనందరావు, గొర్లె విజయ్‌కుమార్, పిసిని జగన్నాథంనాయుడు, డీజీఎం శ్రీను, దెయ్యం వసంతరావు, పిన్నింటి భాను, కనకరావు, కెల్ల హేమంతుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపండి

జి.సిగడాం: రాష్ట్రాన్ని పాలిస్తున్న సైకో ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కోరారు. గురువారం దేవరవలస పంచాయతీ మంగంపేట, నడిమివలస పంచాయతీ గడబుపాలెం గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, జక్కంపూడి దాసు, మీసాల మునలినాయుడు, కోన వెంకటరావు, బాలి తమ్మినాయుడు, కూనుబిల్లి కూర్మారావు, మజ్జి కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషి

పలాస/మందస: అందరం కలికట్టుగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు యార్లగడ్డ వెంకన్నచౌదరి కోరారు. గురువారం పలాస, మందస మండలాల్లో కుటుంబ సాధికారిత సారధులతో సమా వేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యం గా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించ గానే వలంటీర్ల కన్నా టీడీపీ నాయకులే ప్రతి ఇంటిముందు ఉండాలన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, కుత్తుమ లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, తమ్మినేని గంగారామ్, కద్దాల నాగేశ్వర రావు, భావన దుర్యోధన, కె.నాయుడు, టి.భాస్కరరావు, డొంకూరు తిరుపతి, బి.కర్రయయ, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



పలాస మండల నాయకులతో మాట్లాడుతున్న వెంకన్నచౌదరి

జాడుపూడిలో బాబు ష్యూరిటీ

కంచిలి: వైసీపీ పాలనకు అంతం పలికే రోజులు దగ్గర పడ్డాయని కంచిలి మండల టీడీపీ కార్యదర్శి మాదిన రామారావు తెలిపారు. గురువారం జాడుపూడి పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్ణ, పిలక చినబాబు, మద్దిల భాస్కర్, రవికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: వసపలో పర్యటిస్తున్న కలమట, జనసేన, టీడీపీ నేతలు



అరసవల్లి: బాబు ష్యూరిటీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి



జి.సిగడాం: సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న రామ్‌మల్లిక్



కంచిలి: జాడుపూడిలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న నాయకులు

నేడు ఎర్రన్నాయుడు జయంతి

టెక్కలి: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 67వ జయంతిని శుక్రవారం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు టీడీపీ పొలిటికల్ పీఏ లాడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఇతర ముఖ్య నాయకులు రానున్నాయని, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

సంతబొమ్మాళి: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజావేదికను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.ఉమాసుందరి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

29లోగా దుకాణాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నరసన్నపేట: నరసన్నపేట కార్మికశాఖ పరిధిలోని అన్ని దుకాణాలు, సంస్థలు ఈనెల 29లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ వి.జయశంకర్ ఒక ప్రకటనలో కోరారు. కార్మి కులు లేకున్నా రిజిస్ట్రేషన్ తప్పని సరని, మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. ● **పలాసరూరల్:** కార్మికశాఖ పరిధిలోని అన్ని దుకాణాలు, సంస్థల యజమానులు ఈనెల 29లోగా రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలని టెక్కలి సహాయకార్మికశాఖాధికారి జి.ఎల్లాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ కేంద్రాలు, గ్రామ,వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఉంటే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

పాఠశాలను సందర్శించిన లిప్ బృందం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాంను బృంద సభ్యులు గురువారం సందర్శించారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నామని బృందం సభ్యులు తెలిపారు. ఐదు సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులను కమిటీగా నియమించారు. విద్యార్థుల్లో సంభాషణ, ఆలోచన నైపుణ్యాలను పరిశీలించి సూచనలు చేస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షణ్ముఖరావు, లక్ష్మీనారాయణ, శ్రీను, తిరుపతిరావు, లక్ష్మణరావు, హెచ్‌ఎంలు డి.గోవిందరావు, నూక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 28మంది ఎంపిక

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ, కృష్ణపట్నం సెక్యూరిటీ సర్వీసెస్ సంయు క్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 28మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. అర్హతను బట్టి ఎంపికైన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, ఝాన్సీరాణి, ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రాల పరిశీలన

నరసన్నపేట: పట్టణంలో ఎనిమిది గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ కె.కనకారావు గురువారం పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలైన విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యం, మరుగుదొడ్లతో పాటు స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. జ్ఞానజ్యోతి, పద్మావతి, డీఆర్ఎల్ఎన్, ఎంఎల్ ఆర్‌నాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు.

నరసన్నపేటలో 'ప్రజాపోరు'

నరసన్నపేట: పట్టణంలో గురువారం బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం రంగు వేసుకుని ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ లైన్లు

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా విద్యుత్ లైన్లు వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్(కన్‌స్ట్రక్షన్స్) డీఈఈ కేఎస్ జగదీష్ తెలిపారు. గురువారం ఉర్లాం, దేవాది సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు ప్రత్యేక విద్యుత్ లైన్ పనులను పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసన్నపేట మండలంలో ఉర్లాం, దేవాది సబ్‌స్టేషన్ల పరిధిలో 17,259 విద్యుత్ మీటర్లు, 593 ట్రాన్స్‌ఫార్మర్లు, 1200 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ వెళుతోందని, గృహావసరాలకు, వ్యవసాయ పంపుసెట్లకు వేర్వేరుగా ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని హెచ్‌ఎం గొద్దు రఘునాథరావు అన్నారు. యలమంచిలి ఉన్నత పాఠశాల ఆవరణలో వాన కనకయ్య ఆర్థిక సాయంతో నిర్మించనున్న కళావేదిక పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాతను అభినం దించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వాన శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ చేయాలి

నందిగాం: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్పీవో ఐవీ రమణ సూచించారు. గురువారం నందిగాం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రక్రియను ఈనెల 24లోగా పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని, విశ్వకర్మ, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తిచేయాలన్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల డిజిటల్ ట్యాగ్ రెన్యువల్ ప్రక్రియ నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు: చిన్నదూగాం కూడలిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ 62వ వార్షికోత్సవంలో భాగంగా మూడో రోజు ఈవో రాధాకృష్ణ నేతృత్వంలో బూరవెల్లికి చెందిన వేద పండితులు ఆరవెల్లి సీతారామస్వామి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రోక్తంగా రామమందిర ప్రారంభం

నందిగాం: దిమ్మిడిజోలలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రారంభం, విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుడు టి.ప్రసాద్‌శర్మ, గ్రామ పురోహితులు మదన్ మోహన్ మిశ్రా తదితర రుత్వికుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ప్రతిష్ఠ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ కింజరాపు రామ్మో హన్ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఎంపీని సర్పంచ్ సలాన దేవమ్మ, కృష్ణా రావు సత్కరించారు. సాయంత్రం సీతా రాముల కల్యాణం వైభవో పేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, జీరు నానీరెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఎంపీని సత్కరిస్తున్న సర్పంచ్

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కాలాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గోపాలదాసునాయుడు, పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు పాల్గొన్నారు.

పశువుల పాకల దగ్ధం

సంతబొమ్మాళి: చిన్నమరువాడలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మెరుగు లక్ష్మి, గంట అంకమ్మలకు చెందిన పశువుల పాకలు దగ్ధమయ్యాయి. రెవెన్యూ సిబ్బంది వచ్చి ప్రమాద వివరాలు సేకరించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందీ తెలియరాలేదు. బాధితులను టీడీపీ నేతలు, మాజీ ఎంపీపీ సూరాడ భీమారావు, మాజీ సర్పంచ్ మైలపల్లి శ్రీరాములు పరామర్శించి ఓదార్చారు.

'ఉపాధి' ఇవ్వడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు



పని కల్పించాలని ఏపీవోను కోరుతున్న కరగాం గ్రామస్థులు

నరసన్నపేట: ఉపాధి పనులు కల్పించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ వివక్ష చూపుతున్నారని కరగాం పంచాయతీ వేతనదారులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం డ్వామా కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. జాబ్‌కార్డులో ఒకరి కంటే ఎక్కువ ఉన్న వారికే మస్టర్ వేస్తున్నారని, వంద రోజుల పని కూడా కల్పించడం లేదని చిన్నకరగాం గ్రామానికి చెందిన సాధు లక్ష్మి, పంగ జగన్నాథం, పంగ రామారావు, పిరియా కృష్ణ, పంగ మోహనరావు తదితరులు ఆందోళన చేపట్టారు. కూలీలను దుర్భాషలాడుతున్నాడని ఏపీవో యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నుంచి అందరికి పని కల్పించడం జరుగుతుందని ఏపీవో తెలిపారు.

ఏహెచ్‌పీ, హుద్‌హుద్ ఇళ్లు అందించండి

పలాస: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే ఏహెచ్‌పీ, హుద్‌హుద్ గృహాలను పేద లబ్ధిదారులకు అందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. హుద్‌హుద్ ఇళ్లు నిర్మించి ఆరేళ్లవుతున్నా లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదన్నారు. ఏహెచ్‌పీ ఇళ్లకు ముందుగానే లబ్ధిదారుల నుంచి డబ్బులు కట్టించుకుని నేటికీ కేటాయించలేదని దీంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED నరసన్నపేట బ్రాంచి నరసన్నపేట వారు ఇచ్చిన టోగట్టు ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి పొట్నూరు వెంకటగణేష్ S/o పొట్నూరు వెంకట గణరాజు వీరి ప్రాపర్టిని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి హక్కులు, రాక్లేలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈక్రింది చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు భాద్యులు కారు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్.డి., శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషనలో చేరిన, పెద్దపాడు గ్రామం రెక్కలాఖలా కలిగినటువంటిన్నీ పాత సర్వే నెం. 784/1బి, 784/3బి, కొత్త సర్వే నెం. 256/3, 257/4లతో పెద్దపాడు పంచాయితీ తీర్మానం నెం.6రుగా తే.28-06-2007దీని ఎప్రూవల్ కాబడిన లే-అవుట్‌లోని ప్లాట్లలో చేరిన ప్లాటు నెం.48రు గల ఖాళీస్థలం కొలతలు, హద్దుల వివరం: తూర్పు పడమరలకు 18 అడుగులు (5.486మీటర్లు), ఉత్తర దక్షిణలకు 50 అడుగులు (15.24మీటర్లు) కొలతలు కలిగి 100 చ.గ. (83చ.మీ.) విస్తీర్ణం గల ఖాళీస్థలంకు హద్దులు: **తూర్పు:** ప్లాటు నెం.47రు ఖాళీస్థలం, **దక్షిణం:** లే-అవుట్‌రోడ్డు, **పడమర:** ప్లాట్ నెంబరు 47రు ఖాళీస్థలం, **ఉత్తరం:** బడ్డి వెంకటనరసయ్య గారిపల్లం భూమి.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED నరసన్నపేట బ్రాంచి నరసన్నపేట వారు ఇచ్చిన టోగట్టు ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి గురుగుబెల్లి వెంకటలక్ష్మి W/o గురుగుబెల్లి తేజేశ్వరరావు ఈమె ప్రాపర్టిని షూరిటీగా తీసుకొని ఈమె భర్త అయిన గురుగుబెల్లి తేజేశ్వరరావు గారికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి హక్కులు, రాక్లేలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈక్రింది చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు భాద్యులు కారు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్.డి., శ్రీకాకుళం మండలం, పొన్నాం పంచాయితీ, పొన్నాం రెవిన్యూ గ్రామం రెక్కలాఖలా గలిగినట్టిన్ని, సర్వే నెంబర్ 32-7 గలిగినట్టిన్ని, S.C.No.131110A01600139 గలిగినట్టిన్ని, ఎసెస్‌మెంట్ నెంబర్ 207 గలిగినట్టిన్ని, డాబాయిల్లు ఆవరణలు అందున్న యావత్తు సదుపాయములతో సహా మొత్తం ఉత్తర కొలతలు, హద్దుల వివరం: తూర్పు పడమరలకు 32 అడుగులు (9.74మీటర్లు), ఉత్తర దక్షిణలకు 50 అడుగులు (15.23మీటర్లు) కొలతలు అనగా 177.77చ.గ. లేక 148.645చ.మీ. విస్తీర్ణం గల నివేశన ఖాళీస్థలంలో 750చ.అ. విస్తీర్ణం గల స్థలంలో కట్టబడిన డాబాయిల్లు ఆవరణలు అందున్న యావత్తు సదుపాయములతో సహా హద్దులు: **తూర్పు:** దానేటి చంటిబాబు గారి ఖాళీస్థలం, **దక్షిణం:** దానేటి శ్రీనివాసరావు గారి ఖాళీస్థలం, **పడమర:** దానేటి జ్యోత్స్నారాణి గారి ఖాళీస్థలం, **ఉత్తరం:** పంచాయితీరోడ్డు.


టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

చికిత్స పొందుతూ సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ మృతి


దిలీప్(ఫైల్)

టెక్కలి: తలగాం సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎండ దిలీప్ విధి నిర్వహణలో స్తంభం నుంచి జారిపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. దిలీప్ బుధవారం పెద్దరోకళ్లపల్లి పరిధి రామ్‌నగర్ సమీపంలో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఏబీ స్విచ్ ఆన్ చేయడంతో ఒక్కసారి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టులో కారు బోల్తా


బోల్తాపడిన కారు

సరుబుజ్జిలి: మండలంలోని షలంత్రి- సవలాపురం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి కల్వర్టులో బుధవారం అర్ధరాత్రి కారు బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. కొత్తూరు మండలంలోని మెట్టూరు గ్రామానికి చెందిన పెద్దిన వినోద్ కుమార్ విశాఖ నుంచి భార్య, ఇద్దరు పిల్లలతో స్వగ్రామానికి కారులో వస్తున్నారు. షలంత్రి- సవలాపురం మధ్యలో రాత్రి 12 గంటల సమయంలో కుక్క అడ్డుగా రావడంతో ఒక్కసారి కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లి చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వినోద్‌కుమార్, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు కారులో నుంచి చిన్నపాటి గాయాలతో బయటకు వచ్చి 108 వాహనం ద్వారా ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ విషయంపై గురువారం వినోద్‌కుమార్ సరుబుజ్జిలి పోలీసులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

మీడియాపై దాడులు హేయం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

సోంపేట: రాష్ట్రంలో మీడియాపై దాడులు హేయమైన చర్య అని మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు వైశ్యరాజు గోపీకిరణ్ తెలిపారు. జర్నలిస్టులపై దాడులకు నిరసనగా తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. మల్లా కృష్ణారావు, విలేకరులు రత్నాల శ్రీనివాసరావు, బీ.కామేశ్వరరావు, వీ.తిరుపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

గుజరాతీపేట: ఉద్యోగ రీత్యా పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక న్యాయసేవా సదనంలో గురువారం మహిళా సిబ్బందికి న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైగింక వేధింపులు ఎక్కడైనా జరిగితే ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ తరుచూ సమావేశమై ఈ కేసులను విచారిస్తుందన్నారు. మెప్మా పీడీ కిరణ్, ఎంపీడీవో సతీష్, ఇందిరా ప్రసాద్, సచివాలయంలోని మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఎస్టీ వసతి గృహాలు మంజూరు

హిరమండలం: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా హిరమండలం మండలానికి రెండు ఎస్టీ వసతి గృహాలు మంజూరయ్యాయని సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పి.జనార్దన రావు తెలిపారు. ఈ మేరకు వసతి గృహాలకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలిం చేందుకు హిరమండలంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సీది, సుభలయ ఆర్ఆర్ కాలనీలో ప్రభుత్వ స్థలాను పరిశీలించారు. ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు సరిపడా భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. దీని కోసం ఎకరా నుంచి రెండెకరాల వరకు ప్రభుత్వ స్థలం అవసర మన్నారు. ఒక్కో వసతి గృహాన్ని రూ.2.30 కోట్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం హిరమండలంలో కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.రాంబాబు, సర్వేయర్ శ్యామలరావు, సర్పంచ్ లంక రోజారాణి, సీఆర్పీ టి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రామారావు

శ్రీకాకుళం క్రైం: తెలగ కులస్థులకు బీసీ సాధనే ధ్యేయంగా ఈ నెల 25న చలో పూసపాటిరేగ పేరిట నిర్వహిస్తున్న ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక విశాఖ-ఏ కాలనీలోని తెలగ సంక్షేమ సంఘ భవనంలో గురువారం విలేఖరులతో ఆయన మాట్లాడారు. వెనుకబడిన తెలగ కులస్థులు 1962 వరకు బీసీల్లో ఉన్నారని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వారిని ఓసీలో చేర్చి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. శవ్వాన ఉమామహేశ్వరరావు, కొండ రాంబాబు, మురళీ, నాయుడు, కవిత, రవికుమార్, రంగారావు, గజపతి, చిన్నశ్రీను పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

గార: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం ఉదయం అంపోలు, సతివాడ గ్రామాల్లో సచివాలయం భవనాలు ఆయన ప్రారంభించారు. సర్పంచ్ గొండు జయరామ్, యాళ్ల నారాయణ మూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీటీసీ పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

జి.సిగడాం: వేసవి కాలం సమీస్తున్న దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణంరాజు అన్నారు. గురువారం ఈవోఆర్డీ కార్యాలయంలో ఎర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.భాగ్యలక్ష్మి, ఎంఈవో పాల్గొన్నారు.

అర్హులకు కేంద్ర పథకాలు

జి.సిగడాం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ కేంద్ర పథకాలు అందించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం అన్నారు. గురువారం జి.సిగడాం, నడిమివలస, ఎందువ, ఎస్‌పీఆర్ పురం గ్రామాల్లో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కోఆర్డినేటర్, మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, గట్టెం అప్పలరాజు, దాశరథి తదితరులు పాల్గొన్నారు.

వారధులుగా వలంటీర్లు

ఆమదాలవలస: ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లు వారథులని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలం, మునిసి పాలిటీ పరిధిలోని వలంటీర్లను ఘనంగా సన్మానించారు. నాయకులు చిరంజీవినాగ్, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి నారాయణరావు పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ నారాయణమ్మ, నర్తు నరేంద్ర పాల్గొన్నారు. కాగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జడ్పీ నిధులతో నిర్మించిన కళావేదికను జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు.


జి.సిగడాం: కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు


అరసవల్లి: యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

వైసీపీ నుంచి టీడీపీలోకి..

● పెరుగుతున్న చేరికలు
● పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం


అరసవల్లి: కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండ లక్ష్మీదేవి

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ జిల్లాలో వైసీపీ నుంచి రోజు రోజుకూ టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనపై విసుగుచెందిన వారంతా ఆ పార్టీని వీడుతున్నారు. ఈ క్రమంలో గురువారం వివిధ ప్రాంతాల్లో పలువురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

మంగంపేటలో 10 కుటుంబాలు..

జి.సిగడాం: దేవరవలస పంచాయతీ మంగంపేట గ్రామానికి చెందిన వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గురువారం బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వెళ్లిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు సమక్షంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు లంకలపల్లి జగ్గారావు, లంకలపల్లి సూరీడమ్మ, లంకలపల్లి దామోదరరావు, బెల్లాపు అసిరప్పడు, కావూరి అసిరప్పడు, కోడూరి శేఖర్, బెల్లాపు బుచ్చిబాబు, కవూరి అప్పన్న, కోడేటి కృష్ణ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిని రామ్‌మల్లిక్ నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, సర్పంచ్ వెంకటరావు, మండల ప్రధాన కార్యదర్శి జక్కంపూడి దాసు, కోన వెంకటరావు, గొలివి శ్రీనివాసరావు, గొల్లాజీ, మజ్జి కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

80 మంది యువకులు..

అరసవల్లి: నగరంలోని పీఎన్ కాలనీ, ముచ్చువానిపేట, చౌదరి సత్యనారాయణ కాలనీ, బాయమ్మ తోట, రాయివీధి, ఆదివారం పేట, దుంపరెల్లివీధికి చెందిన సుమారు 80 మంది యువకులు గురువారం టీడీపీ నాయకుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ మేరకు గురువారం విశాఖ-ఏ కాలనీలో గల ఆయన కార్యాలయంలో వారికి కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, సూపర్ సిక్స్ పథకాలతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అందుకే పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొల్ల నాగేంద్ర యాదవ్, రెడ్డి శంకర్, బుర్రి మధు, గొండు వెంకట రమణమూర్తి, ఎండు చిన్నారావు, గొండు శ్యామసుందర్, ముద్దాడ గున్నయ్య, రాయి కిరణ్, పొన్నాడ ప్రసాద్, చెట్టు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాసంలో..

అసరవల్లిలో గల మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి నివాసంలో గురువారం నగరానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్ ఆధ్వర్యంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

మంత్రి ధర్మాన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

● పదవి నుంచి బర్తరఫ్ చేయాలి ● టీడీపీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

అరసవల్లి: వలంటీర్లు పోలింగ్ ఏజెంట్లుగా పనిచేసి వైసీపీని అధికారంలోకి తేవాలని మంత్రి ధర్మాన వ్యాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమని వివిధ కమిటీలు, టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. మంత్రి ధర్మాన వలంటీర్లకు తన జేబులోంచి జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వమే వారి జీతాలను ఇస్తోందని, అటువంటప్పుడు వలంటీర్లను తమ పార్టీ కోసం పనిచేయాలని మాట్లాడుతూ వైసీపీని గెలిపించాలనడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ధర్మానను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ నెల 26న జిల్లా పర్యటనకు టీడీపీ అధినేత చంద్రబాబు రానున్న నేపథ్యంలో రా.. కదలి రా కార్యక్రమానికి సంబంధించి వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, టీడీపీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, బొనిగి భాస్కరావు, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం, రాష్ట్ర తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, జంగమ సాధికార సమితి డైరెక్టర్ విభూది సూరిబాబు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న పోలీసు అధికారి


జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని గురువారం విశాఖ స్పెషల్ పోలీసు కమాండెంట్ గౌతమి శాలి గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు వారికి అందజేశారు. 1టౌన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి


వాహనదారులకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం: నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్క వాహనదారుడు బాధ్యత వహించాలని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గురువారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా త్రిబుల్ రైడింగ్, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిని పట్టుకుని సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

ప్రజాపోరు ప్రచార రథాల ప్రారంభం


ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్ర ప్రచార రథాలను గురువారం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఈ యాత్ర ద్వారా తీసికెళ్లడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజా విధ్వంసక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి రజిని, సంతపరావు నాగేశ్వరరావు, పీవీ రత్నం, గొర్లె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

అరసవల్లి: శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల (రిమ్స్) ఆసుపత్రుల్లో ఆరు విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందనున్నట్టు సూపరింటెండెంట్ ఎ.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ కె.వెంకటాచలం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయా విభాగాలను ప్రారంభించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆంకాలజీ, సిటీ సర్జరీ విభాగాలకు సంబంధించిన సేవలను అందిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ వైద్యసేవలను జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలలో వారానికి రెండు రోజులు ప్రత్యేక ఓపీ ద్వారా సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ కె.సునీల్ నాయక్, వైద్యులు ఎంవీ సత్యానంద్, ఆర్ఎంవో సుభాషిణి, సంబంధిత విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్లకు అవకాశం

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు సమర్పించేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించిందని రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ హరీందర్ ప్రసాద్ తెలిపారు. నిర్దీత నమూనాలో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. అన్ని జిల్లాల నోడల్ అధికారులతో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రత్యేక శిక్షణలో ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్ తర్వాత ఈ సైట్‌లో అభ్యర్థులు అన్ని వివరాలను నమోదు చేసి, నిర్దీత సమయంలో స్లాట్ బుక్ చేసుకుని, నేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్వో ఎం.అప్పారావు, 16 మంది నోడల్ అధికారులు, డ్వామా పీడీ చిట్టిరాజు, డీపీఆర్వో చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం

గుజరాతీపేట: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ స్టీఫెన్ సన్ బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పీఎన్ కాలనీలో గల ఓ ప్రైవేట్ స్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సౌట్స్ అండ్ గైడ్స్ సంయుక్త కార్యదర్శి ఎం.వాగ్దేవి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఆమదాలవలస: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో ఏఆర్ఎ, ఆర్ఎస్‌లు, కేవీకేలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏఆర్ఎస్, ఆర్ఏఆర్ ఎస్, కేవీకేలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కార్మికుల అధ్యక్షురాలు ఎన్.సీతామహాలక్ష్మి, కార్య దర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, అంబటి యుగంధర్, గణపతి, చిట్టిబాబు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే అశోక్


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. గురువారం మునిసిపాలిటీలో గల రత్తకన్నలో 18,19 వార్డుల పరిధిలో రూ.5 లక్షలు ఎంపీ లాడ్స్‌తో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కాళ్ల ధర్మా రావు, కౌన్సిలర్లు, నాయకులు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, బుగత జగన్, శుభాష్, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీయాదవ్, బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ పాల్గొన్నారు. అలాగే తెలుకుంచిలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త గిన్ని కేశవను పరామర్శించారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: కేంద్రప్రభుత్వం పేదలకు అందజేస్తున్న పథ కాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి కోరారు. గురువారం కేదారిపురం, బెనుగానిపేట, ముచ్చింద్ర, బాలకృష్ణాపురంల్లో బీజేపీ ప్రజాపోరు-2 నిర్వహించారు. కేదారిపురంలో 20మంది యువకులు బీజేపీలో చేరారు.

'బొడ్డేపల్లి' విగ్రహావిష్కరణ

టెక్కలి: టెక్కలి వంశధార కార్యాలయంలో దివంగత ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని గురువారం ఎస్ఈ డోల తిరుమలరావు ఆవిష్కరించారు. బొడ్డేపల్లి 32వ వర్ధంతి సందర్భంగా ఈ కార్య క్రమం నిర్వహించగా మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, ఈఈలు కొత్తకోట శ్రీకాంత్, ప్రదీప్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

అరసవల్లి: అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ మంత్రి ధర్మానను మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రశ్నించారు. గురువారం అరసవల్లిలోని తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మీరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ రోజు అదే పార్టీలో మంత్రిగా ఉంటూ మాట్లాడుతున్న మాటలు దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఒక సీనియర్ మంత్రి, స్పీకర్ ఉండి కూడా శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డును పూర్తి చేయలేని మీరు అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం, సింగుపురం వద్ద 80 శాతం నిర్మాణం పూర్తి చేసిన నర్సింగ్ కాలేజీ ఏదీ పూర్తి చేయలేకపోయారన్నారు.

1న అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమంలో ఒడియా, గణితం కోర్సుల బోధనకు సబ్జెక్ట్ కాంట్రాక్ట్‌ల నియామకానికి వచ్చే నెల 1వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై, పీహెచ్‌డీ/నెట్/స్లెట్ ఏదో ఒకటి కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నిర్ధేశించిన తేదీన ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

ఆర్అండ్‌బీ బంగ్లాలో ఉద్యోగాలకు..

కలెక్టరేట్: ఆర్అండ్‌బీ బంగ్లాలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో వాచ్‌మెన్, శానిటేషన్ పనులు, అటెండర్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీకాకుళం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 22 నుంచి మార్చి 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సర్కిల్, సాయిబులతోట, పీఎస్ఎన్ఎమ్ స్కూల్ దగ్గర, శ్రీకాకుళం అందజేయాలన్నారు.

నిద్దాం.. భక్త జనసంద్రం


ముర్రాటలతో బారులుతీరిన భక్తులు

జి.సిగడాం: నిద్దాలమ్మ వార్షికోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం నిద్దాం గ్రామం భక్త జన సంద్రంగా మారింది. గ్రామ శివారులో ఉన్న గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో వెలసియున్న నిద్దాలమ్మను దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. గ్రామానికి చెందిన వందలాది మంది భక్తులు ముర్రాటలు, పసుపు, కుంకుమలు చెల్లించుకున్నారు. ఐదు రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు, పరిసర గ్రామాల భక్తులు సహకారంతో యాత్ర విజయవంగా సాగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆత్మీయ సభను జయప్రదం చేయాలి

ఆమదాలవలస: ఎంఆర్‌పీఎస్ ఆత్మీయ సభను జయ ప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని ఎంఆర్ పీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. శనివారం పట్టణంలో జరిగే ఎంఆర్ పీఎస్, ఉపకులాల అనుబంధ సంఘాల ఆత్మీయ సమావే శానికి మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంఆర్‌పీ ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు లోపింటి నారాయణరావు, టింగరాజు, ఎంఈఎఫ్ రాడ విజయ్‌కుమార్, సవలాపు రపు భాస్కరరావు, మురపాక కిరణ్, నవిరి గణేష్, చిన్నారావు, కూర్మాన రాజు పాల్గొన్నారు.

టీడీపీ పరిశీలకుడిగా మూర్తి యాదవ్

నందిగాం/సంతబొమ్మాళి: టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న రా.. కదలిరా కార్యక్రమా నికి టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడిగా విశాఖ జిల్లా చోడవరానికి చెందిన వీఎస్ఎన్ మూర్తి నియమితుల య్యారు. ఈయన ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ నెల 26న జిల్లాలో పర్యటిస్తున్నం దున పార్టీ క్యాడర్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ, జనసేన కూటమికి రాష్ట్రంలో వస్తున్న స్పందనను చూసి వైసీపీ నాయకులు బెంబేలెత్తిపోతున్నారన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

● పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి


పొందూరు: జిల్లా కాంగ్రెస్ నాయకులతో పైడి నాగభూషణ్ తదితరులు

ఆమదాలవలస: నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి తెలిపారు. గురు వారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు డీఎస్సీ వద్దు.. మెగాడీఎస్సీ ముద్దు అంటూ సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో కార్యక్రమానికి హాజరైన బొడ్డేపల్లి సత్యవతిని పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడలోని గాంధీనగర్‌లోని చాంద్ కల్యాణ మండపానికి తర లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్‌రెడ్డి ఇన్నాళ్లు మొద్దు నిద్రలో ఉండి నేడు దగా డీఎస్సీని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ నాయకురాలు జి.రజని తదితరులు అరెస్టయ్యారు.

షర్మిలను విడిచిపెట్టాలి

కంచిలి: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలాను విడిచి పెట్టాలని న్యాయవాది బీపీ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగ యువతకు మద్దతునిస్తూ శాంతియుతంగా ధర్నాచేస్తున్న షర్మిలాను అరెస్టుచేయడం తగదని హితవుపలికారు.


సరుబుజ్జిలి: విజయవాడ పోలీసుల నిర్బంధంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

చలో సెక్రటేరియట్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు

పొందూరు: కింతలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైడి నాగభూషణ్ చలో సెక్రటేరియట్ ముట్టడికి హాజరయ్యారు. పోలీసులు నోటీసులిచ్చి విజయవాడకు వెళ్లకుండా అడ్డుపడినా పోలీసుల కళ్లుగప్పి కార్యక్రమానికి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, నాయకులు కోట మధుసూదనరావు, డోల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, తెంబూరి మధుసూదన్, రామ్‌దాస్ తదితరులతో కలిసి విజయవాడ వెళ్లారు.